సాక్షి ప్రకాశం

శనివారం । 1 । ఏప్రిల్ । 2023



ఇద్దరు రాజస్థాన్ దొంగల అరెస్టు

చీమకుర్తిలోని ఒక ఇంటర్నెట్ షాపులో దొంగతనం కేసులో ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు.

- 8లో..



గాలివాన బీభత్సం

కొమరోలు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. 40 ఎకరాల్లో పంటనష్టం సంభవించింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం
35 /26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. ఉక్కపోతగా ఉంటుంది.



న్యూస్‌రీల్

2న తెలుగు రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు

దొనకొండ: మండలంలోని కొచ్చెర్లకోట గ్రామంలో 2వ తేదీ వీరాంజనేయస్వామి తిరునాళ్ల సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, నాల్గవ బహుమతి రూ.10 వేలు విజేతలైన ఎడ్ల యజమానులకు అందజేస్తారన్నారు. నిబంధనల ప్రకారం ఎడ్ల యజమానులు నడుచుకోవాలని గ్రామస్తులు సూచించారు. వివరాలకు 9177088116, 9948698379, 9912726285 నంబర్లలో సంప్రదించాలని వైస్ ఎంపీపీ మిట్టా కోటిరెడ్డి తెలిపారు.

సత్తా చాటిన ప్రకాశం జిల్లా ఎడ్లు



పోటీల్లో బండ లాగుతున్న ప్రకాశం జిల్లా ఎడ్లు

గిద్దలూరు రూరల్: శ్రీరామనవమి పండుగ సందర్భంగా మండలంలోని పొదలకుంటపల్లెలోని వీరాంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన న్యూ కేటగిరీ రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీల్లో ప్రకాశం జిల్లా ఎడ్లు సత్తా చాటి ప్రథమ స్థానంలో నిలిచాయి. చీమకుర్తికి చెందిన జంగా విజయభాస్కర్‌రెడ్డి ఎడ్లు 3250 అడుగుల దూరం బండను లాగి మొదటి బహుమతి కింద రూ.50 వేలు, కురిచేడుకు చెందిన కాటం పెద్దిరెడ్డి ఎడ్లు 3187 అడుగులు బండను లాగి రెండో బహుమతి కింద రూ.40 వేలు, గిద్దలూరు మండలం బురుజుపల్లె సోహిత్‌రెడ్డి ఎడ్లు 3157 అడుగులు లాగి మూడో బహుమతి కింద రూ.30 వేలు, కంభానికి చెందిన మేకల రాజులు, రెంటచింతల ఈశ్వర్ ప్రసన్నకుమార్ యాదవ్ లకు చెందిన ఎడ్లు 2802 అడుగులు దూరం బండ లాగి నాల్గవ బహుమతి కింద రూ.20 వేలు, దర్శికి చెందిన రాజశేఖరరెడ్డి ఎడ్లు 2767 అడుగుల దూరం లాగి ఐదో బహుమతి కింద రూ.10 వేలను దక్కించుకున్నాయి.

రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీల్లో గిద్దలూరు ఎడ్ల సత్తా



పోటీల్లో బండలాగుతున్న గిద్దలూరు ఎడ్లు

కంభం: ఉపదేశ రామస్వామి వారి 59వ వార్షిక కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని లింగోజిపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సీనియర్ విభాగం రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల్లో గిద్దలూరు మండలం కొండపేట గ్రామానికి చెందిన మీనిగ కాశయ్యకు చెందిన ఎడ్లు 3251.01 అడుగుల దూరం లాగి సత్తా చాటి ప్రథమ స్థానంలో నిలిచాయి. పెద్దారవీడు మండలం సుంకేసులకు చెందిన ముద్దపాటి శ్రీనివాసులు ఎడ్లు 2907.03 అడుగులు లాగి ద్వితీయ స్థానం, వారికే చెందిన మరో జత ఎడ్లు 2800 అడుగులు లాగి తృతీయ స్థానం, పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన దప్పిలి ఆంజిరెడ్డి ఎడ్లు 2607.09 అడుగులు లాగి నాల్గవస్థానం, పెద్దారవీడు మండలం కలనూతన గ్రామానికి చెందిన జశ్వంత్ ఎడ్లు 1407.08 అడుగుల దూరం లాగి ఐదో స్థానంలో నిలిచాయి. విజేతలకు బహుమతుల కింద రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు అందజేశారు.

పశువులకు కృత్రిమ గర్భధారణ టీకాలు వేయించాలి

- పశుసంవర్ధకశాఖ జేడీ బేబిరాణి

పొదిలి రూరల్: జిల్లాలోని పాడి రైతులకు సంబంధించిన ఆవులు, గేదెలకు కృత్రిమ గర్భధారణ టీకాలు వేయించాలని జిల్లా పశు సంవర్థకశాఖ అధికారి డాక్టరు కే బేబిరాణి తెలిపారు. జాతీయ కృత్రిమ గర్భధారణ పథకం (ఎన్‌ఏఐపీ) ద్వారా ఏప్రిల్ 23 నుంచి జూలై నెల 23 వరకు నాలుగు నెలలు పశు సంవర్థక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ వారి సంయుక్త ఆధ్వర్యంలో కృత్రిమ గర్భధారణ టీకాలు ఉచితంగా వేస్తారన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో చేపట్టిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అభివృద్ధి సోపానమవుతోంది. ఇంటింటికీ ఉపాధి కల్పించడంతో పాటు.. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు దోహదపడుతోంది. ఉపాధి హామీ పథకం అమలులో రాష్ట్రంలో మన జిల్లా రెండో స్థానంలో ఉంది. ఫలితంగా సుస్థిరాభివృద్ధి కలుగుతోంది.

ఉపాధి నిధులు	ప్రభుత్వ భవనం పేరు	మంజూరైనవి	పూర్తయినవి
రూ.226 కోట్లు	గ్రామ సచివాలయాలు	593	337
రూ.129 కోట్లు	ఆర్బీకేలు	593	337
రూ.86 కోట్లు	వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు	492	221



- 2022-23 సంవత్సరానికి 1.76 కోట్ల పనిదినాలు
- 3.11 లక్షల కుటుంబాల్లో 5.49 లక్షల మందికి ఉపాధి పనులు
- అమృత్ సరోవర్ కింద నీటి వనరుల అభివృద్ధి
- వైఎస్సార్ జలకళ ద్వారా రూ.7.9 కోట్లతో 1740 వ్యవసాయ బోర్లు
- ఉపాధి హామీ పథకం అమలులో మన జిల్లా రాష్ట్రంలో రెండో స్థానం

అభివృద్ధి సోపానంగా.. ఇంటింటికీ ఉపాధి

ఒంగోలు అర్బన్:

ఉపాధి హామీ పథకం ద్వారా లక్ష్యం మేరకు పేదలకు పనిదినాలు కల్పించడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఉన్న భవనాలను నిర్మిస్తూ క్షేత్ర స్థాయిలో అభివృద్ధి చేస్తోంది. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధించే దిశగా అడుగులు వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. అటువంటి గ్రామ సచివాలయాలకు సొంత భవనాలు ఉండాలని జిల్లా వ్యాప్తంగా గ్రామ సచివాలయ భవనాలను ఉపాధిహామీ పథకానికి అనుసంధానం చేసి నిర్మాణాలు చేపట్టారు. అంతేకాకుండా రైతులకు విత్తు నాటినప్పటి నుంచి పంట ఉత్పత్తి అమ్ముకునే వరకు తోడుగా ఉండేలా రైతు భరోసా కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో సైతం మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉంచేందుకు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల భవనాలు సైతం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో నిర్మిస్తున్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలకు భూములు కేటాయించడం, భవనాలు నిర్మించడం వంటి ప్రతిష్టాత్మకమైన పనులను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ నిరంతరం పర్యవేక్షిస్తూ, సమీక్షలు నిర్వహిస్తూ పనులు వేగవంతంగా చేపట్టారు. అంతేకాకుండా నీటి వనరుల అభివృద్ధి, పేదల వ్యవసాయ భూముల్లో ఉచిత బోర్లు వేస్తున్నారు. ఉపాధి హామీ పథకం అమలులో రాష్ట్రంలో మన జిల్లా రెండో స్థానంలో ఉండటాన్ని బట్టి జిల్లాలో ఎంత పక్కాగా పథకం అమలవుతుందో అర్థమవుతోంది.

3.11 లక్షల కుటుంబాల్లో 5.49 లక్షల మంది కూలీలకు ఉపాధి:

2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం ద్వారా పేదలకు ఒక్కో వ్యక్తికి 100 రోజుల పనిదినాలు కల్పించాలి. జిల్లాలో ఇప్పటికే 90 శాతానికిపైగా పనిదినాలు కల్పించారు. జిల్లాలో 1.76 కోట్ల పనిదినాలు కల్పించాల్సిన లక్ష్యం ఉండగా 1.56 కోట్ల పనిదినాలు కల్పించారు. జిల్లాలో 3.11 లక్షల కుటుంబాలకు చెందిన 5.49 లక్షల మంది కూలీలు ఉపాధి పనుల్లో ఉపాధి పొందుతున్నారు.

నీటి వనరుల అభివృద్ధి:

ఉపాధి హామీ పథకం ద్వారా అమృత్ సరోవర్ పేరుతో జిల్లాలో నీటి వనరులైన చెరువులను అభివృద్ధి చేస్తున్నారు. జిల్లాలో 198 పనులు నిర్దేశించగా వాటిలో 71 పనులు పూర్తై మిగిలినవి వివిధ దశల్లో పనులు జరుగుతున్నాయి. చెరువుల అభివృద్ధితో స్థానికంగా తాగు, సాగు నీటికి కొంతమేర ఇబ్బందులు తొలగినట్లే.

గ్రామ స్థాయిలో ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు:

గ్రామ స్థాయిలో అన్నీ వర్గాల ప్రజలకు ప్రయోజనం కలిగేలా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలకు సంబంధించి భవనాలను ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకుని నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో గ్రామ సచివాలయాల భవనాలు రూ.226 కోట్లతో 591 భవనాల నిర్మాణం చేపట్టగా వాటిలో ఇప్పటికే 397 భవనాలు రూ.135 కోట్లతో పూర్తి చేశారు. అదేవిధంగా రూ.129 కోట్లతో 593 రైతు భరోసా కేంద్రాలు నిర్మించగా వాటిలో రూ.76 కోట్లతో 337 ఆర్బీకేలు పూర్తయ్యాయి. వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు రూ.86 కోట్లతో 492 భవనాలు నిర్మించాల్సి ఉండగా ఇప్పటికి రూ.46 కోట్లతో 221 భవనాలు పూర్తయ్యాయి.

వైఎస్సార్ జలకళ ద్వారా వ్యవసాయ బోర్లు

వైఎస్సార్ జలకళ ద్వారా వ్యవసాయ బోర్లను ఉచితంగా ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో జలకళ ద్వారా 19,706 దరఖాస్తులు రాగా వాటిలో 3,942 మంజూరయ్యాయి. మంజూరైన వాటిలో రూ.7.9 కోట్లతో 1,740 వ్యవసాయ బోర్లను రైతులకు ఉచితంగా వేశారు. దీంతో సాగునీటి వసతి లేని రైతులకు ఎంతగానో ఉపకరిస్తోంది.

ప్రభుత్వ సేవలు ప్రజల ముంగిటకు



ప్రభుత్వం అందించే సేవలు ప్రజల ముంగిటకు తీసుకెళ్లేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందులో భాగంగా జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యత ఉన్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల నిర్మాణాలను వేగవంతం చేశాం. నిర్మాణాలకు ఉపాధి హామీ పథకం అనుసంధానంతో పూర్తి చేస్తున్నాం. దీని ద్వారా పేదలకు పనిదినాలు కల్పించడంతో పాటు ప్రభుత్వ భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయి. నిర్మాణాల్లో కూడా నాణ్యత ప్రమాణాలను పక్కాగా పర్యవేక్షిస్తున్నాం. జలకళ ద్వారా నీటి వనరులు లేని రైతులకు వ్యవసాయ బోర్లు వేస్తున్నాం. త్వరలో ప్రభుత్వ భవనాల నిర్మాణాలు లక్ష్యం చేరుకుంటాం. ఉపాధి పనులు కల్పించడంలోను జిల్లాలో మంచి ఫలితాలు సాధించాం. మొత్తం మీద ఉపాధి హామీ పథకం అమలులో మనం రాష్ట్రంలో రెండో స్థానంలో ఉన్నాం.

– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్

నిబద్ధత గల ప్రభుత్వం

- జగనన్న మహిళల పక్షపాతి
- ఆడపిల్లలకు ఇచ్చిన మాటతప్పితే నాశనమే
- వాగ్దానాలు చేసి అక్కచెల్లెమ్మలను మోసం చేసిన చంద్రబాబు
- రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్



మహిళలకు ఆసరా నగదు చెక్కు అందజేస్తున్న విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నిబద్ధతతో ముందుకు సాగిపోతుందని, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతి కావడం వలన అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా 3వ విడత వారోత్సవాల్లో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు జగనన్న చేసిన సుదూర పాదయాత్రలో పొదుపు మహిళలు తాము చేసిన అప్పులు కట్టలేక నలిగిపోతున్న పరిస్థితిని చూసి 2019 నాటికి ఉన్న అప్పులు పూర్తిగా విడతల వారీగా రద్దుచేస్తానని మాట ఇచ్చారన్నారు. నవరత్నాల్లో చేర్చి మూడు విడతలుగా నేరుగా మహిళల అకౌంట్‌లలో జమ చేశారని చెప్పారు. 2014లో జరిగిన ఎన్నికల సందర్భంగా ఏదో ఒక రకంగా తిరిగి అధికారాన్ని చేచిక్కించుకోవాలన్న దుర్బుద్ధితో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అనేక వాగ్దానాలు చేశారని, అధికారంలోకి వచ్చిన తరువాత ఏ ఒక్కవాగ్దానం నెరవేర్చలేక పోయాడని ఆయన విమర్శించారు. వైఎస్సార్ అధికారంలో ఉన్న సమయంలో పొదుపు మహిళలకు పావలా వడ్డీకే రుణాలు ఇచ్చారని, ఆయన తనయుడు మరో అడుగు ముందుకేసి సున్నా వడ్డీకే రుణాలు ఇప్పిస్తున్నారని అన్నారు. సంక్షేమం-అభివృద్ధి రెండు కళ్లుగా భావించి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర పాలనను సజావుగా ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. మరో మూడు దశాబ్దాల పాటు ఆయనే ముఖ్యమంత్రిగా కొనసాగాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని హర్షధ్వానాల మధ్య అన్నారు. అనంతరం పుల్లలచెరువు, యర్రగొండపాలెం, త్రిపురాంతకం మండలాల్లో ఉన్న 1670 గ్రూపులకు చెందిన 16,670 మంది లబ్ధిదారులకు రూ.8.10 కోట్ల ఆసరా చెక్కును మంత్రి మహిళా గ్రూపులకు అందచేశారు. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, డీఆర్‌డీఏ పీడీ బాబురావు, డీఎల్‌డీవో బి.వి.ఎస్.సాయికుమార్, తహసీల్దార్ రవీంద్రరెడ్డి, ఎంపీడీవోలు రామసుబ్బరాయుడు, రాజ్యలక్ష్మి, వైఎస్సార్ క్రాంతిపథం ఏరియా కో ఆర్డినేటర్ కె.లక్ష్మిరెడ్డి, జార్జి విద్యాసంస్థల చైర్మన్ ఆదిమూలపు విశాల్, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల జెడ్పీటీసీ సభ్యులు చేదూరి విజయభాస్కర్, రామావత్ వాగ్యానాయక్, పీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల పార్టీ అధ్యక్షులు కె.ఓబుల్‌రెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు డి.సుబ్బారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.బాలచెన్నయ్య, సర్పంచ్ అరుణాబాయి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరితగతిన జరగాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

- కలెక్టర్ దినేష్ కుమార్

పొదిలి: జగనన్న లే అవుట్లో గృహ నిర్మాణాలు తగు రీతిలో ముందుకు సాగటం లేదని, కలెక్టర్ దినేష్ కుమార్ సంబంధిత సంస్థ ప్రతినిధులపై అసహనం వ్యక్తం చేశారు. పిచ్చిరెడ్డితోట సమీపంలోని జగనన్న లేఅవుట్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు, అధికారులతో, నిర్మాణ సంస్థ వారితో ఆయన మాట్లాడారు. గృహ నిర్మాణాలు వేగవంతం కాకపోవటానికి కారణాలేమిటని ప్రశ్నించారు. సంస్థ ప్రతినిధులు చెప్పిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తక్షణమే అవసరమైన నిధులను మంజూరు చేస్తామని చెప్పారు. వెయ్యి గృహాలు మంజూరు కాగా, 600 గృహాలు బేస్‌మెంట్ లెవెల్ వరకు వచ్చాయన్నారు. మెటీరియల్ దొంగల పాలవుతుందనే విషయమై కలెక్టర్ స్పందించారు. బీట్‌లు ఏర్పాటు చేయాలని, జరిగిన మెటీరియల్ సొత్తును రికవరీ చేసేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అనంతరం మూడో సచివాలయం సందర్శించారు. అక్కడ ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. నాడు-నేడు పథకంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న భవన నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాఠశాల ఆవరణలోని భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. వివరాలను సీడీపీవో సుధామారుతిని అడిగి తెలుసుకున్నారు. తదుపరి జువ్వలేరు రోడ్డులోని కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో అజయ్ కుమార్, హౌసింగ్ పీడీ పేరయ్య, మార్కాపురం డీఈ పవన్‌కుమార్, డీఎల్‌డీవో సాయికుమార్, ఎంపీడీవో శ్రీకృష్ణ, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జోసెఫ్ డానియేల్, ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

ఏడాదిలోగా ప్రతి ఇంటికీ సాగర్ నీరు

- కనిగిరి పట్టణ ప్రగతికి సంపూర్ణ సహకారం
- ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్
- రూ.32.68 కోట్ల బడ్జెట్‌కు మున్సిపల్ పాలక మండలి ఆమోదం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: పట్టణ ప్రగతికి, అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని టీటీడీ పాలక మండలి సభ్యుడు, ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం 2023-24 బడ్జెట్, సాధారణ సమావేశాలు రెండు మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ మున్సిపల్ నిధుల వినియోగంలో కౌన్సిల్ సభ్యులు, అధికారులు సమన్వయంగా పనిచేయాలన్నారు. సమష్టి ప్రణాళికతో అధికారులు, పాలక మండలి సభ్యులంతా ముందడుగు వేసినప్పుడే అభివృద్ధి శరవేగంగా జరుగుతుందన్నారు. పట్టణంలో ప్రధానంగా ఉన్న నీటి సమస్యను ఏడాది లోపు ఇంటింటికీ సాగర్ నీటి కుళాయిలు అందించి పరిష్కరిస్తానని ఎమ్మెల్యే బుర్రా అన్నారు. సాగర్ జలాలు ఇంటింటికీ అందిస్తే ట్యాంకర్ల ద్వారా నీటి రవాణా ఖర్చు తగ్గుతుందని, ఆ నిధులతో అభివృద్ధి పనులు మరింత వేగవంతంగా చేసుకోవచ్చన్నారు. పట్టణంలోని దొరువు ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు అధికారులు ప్రణాళికబద్ధమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు.

ఎమ్మెల్యే సహకారంతోనే పట్టణాభివృద్ధి శరవేగం:

తనపై ఎంతో నమ్మకంతో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పట్టణ పాలనలో సంపూర్ణ మద్దతు, సహకారం, ప్రోత్సాహం అందిస్తూ నిధుల మంజూరుకు కృషి చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. మున్సిపాలిటీలో రెండేళ్ల పాలనలో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. 20 వార్డుల్లో 100కు పైగా నూతన పోల్స్‌ను, ఒక్క 11వ వార్డులోని 50 పోల్స్ మార్పించామని, విద్యుత్ సమస్య పరిష్కారానికి 20 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఈ ఏడాది రూ.4.24 కోట్ల పన్నులు వసూళ్లు:

గతేడాది కంటే ఈ ఏడాది రూ.4.24 కోట్లు వివిధ రకాల పన్నులు మార్చి నాటికి వసూలు చేశామని కమిషనర్ డీవీఎస్ నారాయణరావు తెలిపారు. గతేడాది కంటే 30 శాతం వసూళ్లు పెరిగాయన్నారు. ఇంకా రూ.80 లక్షల బకాయిలు మిగిలి ఉన్నాయన్నారు. ఏఎస్‌సీ గ్రాంట్ లేనందున ఏడాదికి రూ.3 కోట్లు మున్సిపాలిటీలో నీటి రవాణాకు అదనపు ఖర్చు పడుతున్నట్లు వివరించారు. దీంతో వార్షిక ఆదాయానికి ఖర్చుకు సరిపోతున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు పన్నులు వేయని గృహాలను పట్టణంలో 600 వరకు గుర్తించామని, వాటికి కూడా త్వరలో పన్నులు వేస్తామన్నారు. మే, జూన్ నెలల్లో అమృత్ 2.0 స్కీం కింద రూ.2 కోట్లతో పనులకు టెండర్లు పిలుస్తామని వెల్లడించారు.

రూ.32.68 కోట్ల బడ్జెట్‌కు పాలక మండలి ఆమోదం

బడ్జెట్‌లో పొందిపర్చిన వివిధ అంశాలకు పాలక మండలి ఏకగ్రీవంగా ఆమోదించింది. వార్షిక బడ్జెట్‌లో రూ.32.68 కోట్ల ఆదాయం వస్తుండగా, అందులో రూ.32.10 లక్షలు రెవెన్యూ, కాపిటల్ ఖర్చుగా చూపించారు. రూ.58.80 లక్షల మిగులు బడ్జెట్‌కు పాలక మండలి ఆమోదం తెలిపింది. అలాగే సాధారణ సమావేశంలోని 17 అంశాలను ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాణిక్యరావు, కౌన్సిలర్లు తమ్మినేని సుజాత, దాసరి పద్మ, సయ్యద్ రిజ్వాన ఖాలక్, దేవకి సత్యవతి, షఫీ జాస్మిన్, ఎస్‌కే కరీమున్నిసా, చొప్పవరపు మాధవి, పసుపులేటి దీప, పులి విజయలక్ష్మి, నక్కా ఉమాదేవి, వేల్పుల వెంకటేశ్వర్లు, శ్రీరాం సతీష్, పీ రాజా, దేవరాజ్, కోఆప్షన్ సభ్యులు సాహెరాబాను, ఖాజా, అబ్రహం లింకన్, చింతం శ్రీను, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు పకడ్బందీ చర్యలు

- వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ మలికా గర్గ్ ఆదేశాలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: ఏప్రిల్ 3 నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఎస్పీ మలికా గర్గ్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో పదో తరగతి పరీక్షలు జరిగే 175 కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 144 సెక్షన్ విధించాలని సూచించారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని, ప్రశ్న పత్రాలు, సమాధాన పత్రాల తరలింపు సమయంలో పటిష్టమైన ఎస్కార్ట్‌ను నియమించాలని, ప్రతి సర్కిల్‌కు ఒక మొబైల్ పెట్రోలింగ్ టీంను ఏర్పాటు చేయాలన్నారు. మిస్సింగ్ కేసులు త్వరగా పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని, కేసు నమోదైన వెంటనే ప్రత్యేక టీమ్ లను రంగంలోకి దించాలని, ఆధునాతన విజ్ఞానం సహకారంతో ఆచూకీ కనుగొనేందుకు కృషి చేయాలని చెప్పారు. మిస్సింగ్ కేసుల్లో ఎంత వేగంగా విచారణ జరిపితే అంత తొందరగా ట్రేస్ చేయవచ్చని తెలిపారు. మిస్సింగ్ కేసుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. 2023వ సంవత్సరంలో ఇప్పటి దాకా జరిగిన రోడ్డు ప్రమాదాలను ఆరా తీశారు. జాతీయ రహదారులపై తరచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, సింగిల్ రోడ్ల మీద హెవీ లోడ్‌తో వాహనాలు వెళ్లకుండా నిలిపివేయాలని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని కొనసాగించాలని స్పష్టం చేశారు. జిల్లాలో నమోదైన చీటింగ్ కేసులపై సమగ్ర దర్యాప్తు చేసి తగిన సాక్ష్యాధారాలను సేకరించాలని, బాధితులకు సకాలంలో న్యాయం చేయాలన్నారు. మోసాలకు గురికాకుండా ప్రజల్లో అవగాహన పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. సుప్రీం కోర్టు సూచనల ప్రకారం 41ఏ నోటీసు నియమ నిబంధనలను వివరించారు. ప్రతి పోలీసు స్టేషన్‌లో తప్పని సరిగా 41ఏ నోటీసులకు సంబంధించిన ప్రత్యేక రిజిస్టర్లను నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పీ (క్రైమ్) ఎస్వీ శ్రీధర్‌రావు, డీఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, మార్కాపురం డీఎస్పీ కిషోర్‌కుమార్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ దేవ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈ నెల 30 వరకు థర్టీ పోలీస్ యాక్ట్

ఒంగోలు టౌన్: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్లు ఒంగోలు డీఎస్పీ యు.నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించరాదన్నారు. రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, యూనియన్లకు చెందిన వారు కచ్చితంగా పోలీసు ఆజ్ఞలను పాటించాలన్నారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దొంగతనం కేసులో ఇద్దరికి జైలు శిక్ష

కనిగిరి రూరల్: దొంగతనం కేసులో ఇద్దరు నేరస్తులకు కనిగిరి జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు న్యాయమూర్తి కె. భరత్ చంద్ర శుక్రవారం శిక్ష విధించారు. దొంగతనం నేరం కింద అభియోగం రుజువు కావడంతో పామూరు మండలం నల్లమారెళ్ల గ్రామానికి చెందిన శ్రీ రామ్ శ్రీను, శ్రీరామ్ నరేష్‌లకు జరిమానతో పాటు జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు వెల్లడించారు. 2016లో దారి దోపిడీకి పాల్పడిన శ్రీ రామ్ శ్రీను, నరేష్‌లకు రూ. 500 జరిమాన, ఏడాది పాటు కఠిన కారాగార శిక్షను రెండు కేసుల్లో వేర్వేరుగా విధించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గుడ్లూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న సురేఖ (35) గురువారం అర్ధరాత్రి మృతి చెందినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన సుబ్బారెడ్డి తన భార్య సురేఖతో కలిసి బైక్‌పై గురువారం కోవూరుకు వెళ్లి తిరిగి వెళుతుండగా పందులు రోడ్డుకు అడ్డంగా వచ్చి బైక్‌ను ఢీకొనడంతో కింద సురేఖకు తీవ్ర గాయాలైన సంగతి తెలిసిందే. కందుకూరు ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. దీంతో బాధితురాలి కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆస్తి పన్ను వసూళ్లలో మూడో స్థానంలో చీమకుర్తి

చీమకుర్తి: ఆస్తి పన్ను వసూళ్లలో చీమకుర్తి మున్సిపాలిటీ రాష్ట్రంలోనే మూడో స్థానంలో ఉన్నట్లు కమిషనర్ షేక్ ఫజులుల్లా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తి పన్ను డిమాండ్ రూ.2.84 కోట్లు కాగా, వసూలు చేసింది రూ.2.76 కోట్లని వెల్లడించారు. 97.18 శాతం వసూళ్లతో రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచినట్లు కమిషనర్ వివరించారు. సహకరించిన ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్పీని కలిసిన సీఐలు

ఒంగోలు టౌన్: సాధారణ బదిలీల్లో భాగంగా వివిధ పోలీస్‌స్టేషన్లకు బదిలీ అయిన సీఐలు శుక్రవారం బాధ్యతలు చేపట్టి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మలికాగర్గ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఒంగోలు తాలూకా సీఐగా విధులు నిర్వర్తిస్తూ ఒంగోలు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయిన వి.శ్రీనివాసరెడ్డి సర్కిల్‌లో రిపోర్టు చేసిన అనంతరం ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అదేవిధంగా కనిగిరి సీఐగా బదిలీ అయిన ఏ శివరామకృష్ణారెడ్డి కూడా ఎస్పీని కలిసి పూలమొక్క అందజేశారు.

దొంగకు ఏడాది జైలు శిక్ష

హనుమంతునిపాడు: హాజీపురం అడ్డరోడ్డులో సీతారాంపురం గ్రామానికి చెందిన మహిళ మెడలో తాళి బొట్టు సరుడు లాగుకొని దొంగలించిన ఇద్దరు దొంగకు కనిగిరి జ్యూడీషియల్ కోర్టు జడ్జి కె. భరత్ చంద్ర ఒక ఏడాది జైలు శిక్ష విధించినట్లు ఎస్సై జి. క్రిష్ణ పావని శుక్రవారం తెలిపారు. ఎస్సై ఇచ్చిన సమాచారం మేరకు 2015 సంవత్సరం హాజీపురం అడ్డ రోడ్డులో మెట్ల రంగమ్మ మెడలో తాళి బొట్టు సరుడును శ్రీరామ శ్రీను, శ్రీరామ నరేష్, మహిళ మెడలో తాళి బొట్టు సరుడు లాక్కొని దొంగలించారు. శుక్రవారం జరిగిన కోర్టు విచారణలో కనిగిరి జ్యూడీషియల్ కోర్టు జడ్జి కె. భరత్ చంద్ర ముద్దాయిల ఇద్దరికి ఒక ఏడాది కఠిన కారాగార జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.



పొగాకు పచ్చాకు ట్రాక్టర్‌పై ప్రమాదకర స్థితిలో ప్రయాణిస్తున్న కూలీలు



పంట నూర్పిడి, విత్తన కోత యంత్రంపై..

బతుకు కూలితే!

కూటి కోసం కూలి కోసం.. పట్టణంలో బతుకుదామని బయలుదేరిన బాటసారికి ఎంత కష్టం.. ఎంత కష్టం. మబ్బు పట్టి గాలి కొట్టి, వాన వస్తే, వరద వస్తే.. చిమ్మ చీకటి కమ్ముకొస్తే దారి తప్పిన బాటసారికి ఎంత కష్టం..ఎంత కష్టం. మహా కవి శ్రీశ్రీ అక్షరాలు ఎప్పటికీ నిలిచే ఉంటాయి. పొట్ట కూటి కోసం శ్రమ జీవులు ఎంత కష్టానికైనా వెనుకాడరు. వారి లక్ష్యం ఒక్కటే, తమ పిల్లలకు కడుపు నిండా భోజనం పెట్టాలని.. వారికి కనీసం సౌకర్యాలు సమకూర్చాలని. ఇలాంటి కూలీలు వ్యవసాయ పనుల కోసం ప్రమాదకర రీతిలో వాహనాలపై ప్రయాణిస్తూ బతుకు సాగిస్తుంటారు. ఒంగోలు సమీపంలో ఇలాంటి దృశ్యాలు కనిపిస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఒంగోలు





ట్రాక్టర్ ట్రక్కు డోర్లు తీసి వాటిపై ఇలా..

ఇద్దరు రాజస్థాన్ దొంగల అరెస్టు

ఒంగోలు టౌన్: చీమకుర్తిలోని ఇంటర్నెట్ షాపులో జరిగిన చోరీ కేసులో రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మలికాగర్గ్ ఆ వివరాలు వెల్లడించారు. సంతనూతలపాడు గ్రామానికి చెందిన గాదంశెట్టి శ్రీనివాసులు చీమకుర్తిలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా గెలాక్సీ నెట్ షాపు నిర్వహిస్తున్నాడు. గత నెల 4వ తేదీ రాత్రి 10 గంటల ప్రాంతంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు షాపు వద్దకు వెళ్లి ఆన్‌లైన్ ద్వారా మనీ ట్రాన్స్‌ఫర్ చేయాలని కోరారు. అందుకుగానూ ఆధార్ కార్డు ఇచ్చారు. దానికి బ్యాంకు లింకు లేదని చెప్పడంతో ఏటీఎం కార్డు ఇచ్చి చిన్నగా మాటల్లో దించారు. తప్పుడు పిన్ నంబరుతో దృష్టి మరల్చారు. ఈలోపు షాపు షట్టర్ మూసి శ్రీనివాసులపై దాడికి పాల్పడ్డారు. కత్తితో దాడిచేసి క్యాష్ కౌంటర్లో ఉన్న 15 వేల రూపాయలు దోచుకెళ్లారు. ఈ దాడిలో శ్రీనివాసులు గాయపడగా, ఈ సంఘటన జిల్లాలో సంచలనం సృష్టించింది. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ.. స్వీయ పర్యవేక్షణలో క్రైమ్ టీమ్‌ను నియమించారు. వెంటనే రంగంలోకి దిగిన రూరల్ ఇన్‌చార్జి సీఐ రంగనాథ్ సిబ్బందితో కలిసి సమాచారం సేకరించారు. గురువారం చీమకుర్తి పట్టణంలోని తూర్పు బైపాస్ రోడ్డు వద్ద సంచరిస్తున్న నిందితులను అదుపులోకి తీసుకున్నారు. రాజస్థాన్‌లోని నాగోర్ జిల్లా నోఖా చందవత గ్రామానికి చెందిన సవర్‌రాం, సాగర్ నాయక్‌లుగా వారిని గుర్తించారు. వీరు చీమకుర్తి మండలంలోని రామతీర్థం సమీపంలో ఉన్న గ్రానైట్ కటింగ్ ఫ్యాక్టరీలో మాల్డింగ్ పనులు చేస్తుంటారు. చెడు వ్యసనాలకు అలవాటు పడి ఖర్చుల కోసం దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో చీమకుర్తి నెట్ షాపులో చోరీకి పాల్పడినట్లు విచారణలో అంగీకరించారు. నిందితులను అరెస్టు చేసిన పోలీసులు.. వారి వద్ద నుంచి రూ.15 వేల నగదు, మోటారు బైకు స్వాధీనం చేసుకున్నారు. ఈ చోరీ కేసును ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన ఏఎస్పీ (క్రైం) ఎస్వీ శ్రీధర్‌రావు, ఒంగోలు డీఎస్పీ యు.నాగరాజు, రూరల్ ఇన్‌చార్జి సీఐ రంగనాథ్, చీమకుర్తి, మద్దిపాడు ఎస్సైలు వి.ఆంజనేయులు, శ్రీరామ్, సింగరాయకొండ హెడ్‌కానిస్టేబుల్ శ్రీమన్నారాయణ, కానిస్టేబుళ్లు రాము, రాఘవులును ఎస్పీ మలికాగర్గ్ అభినందించి ప్రశంసపత్రాలు, రివార్డులు అందజేశారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

గాలి వాన బీభత్సం



నేలకొరిగిన మామిడి చెట్టు



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఎంపీపీ అమూల్య, ఉద్యానవన శాఖాధికారి శ్వేత

- 40 ఎకరాల్లో పంట నష్టం

కొమరోలు: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి సమయంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో మండల వ్యాప్తంగా ఉద్యానవన పంటలు భారీగా దెబ్బతిన్నాయి. మండలంలోని యర్రపల్లి, కొమరోలు, గోనపల్లి, అల్లినగరం, వట్టివేపమానుపల్లెలో ఈదురు గాలులకు 40 ఎకరాల్లో ఉద్యానవన పంటలు నష్ట పోయినట్లుగా ఉద్యానవన శాఖాధికారి డి.శ్వేత తెలిపారు. పలు గ్రామాలలో నష్టపోయిన తోటలను ఎంపీపీ కామూరి అమూల్యతోపాటు ఉద్యానవన శాఖాధికారి శ్వేత పరిశీలించారు. మామిడి, అరటి, బొప్పాయి పంటల నష్టంపై అంచనాకు వచ్చారు. ఎంపీపీ అమూల్య మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఇచ్చే విధంగా ప్రయత్నిస్తానన్నారు.

హేచరీల ప్రతిబంధకాలు తొలగించాలి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రొయ్యల రైతుల సంఘం, హేచరీల నాయకులు

- రొయ్య రైతుల సంఘం జిల్లా కన్వీనర్ దుగ్గినేని గోపీనాథ్

ఒంగోలు సబర్బన్: రొయ్య పిల్లల హేచరీలకు ఉన్న ప్రతిబంధకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తొలగించాలని జిల్లా రొయ్య రైతుల సంఘం కన్వీనర్ దుగ్గినేని గోపీనాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం రొయ్యల హేచరీస్ అసోసియేషన్, జిల్లా రొయ్యల రైతుల సంఘం నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా రొయ్య రైతులు, రొయ్య పిల్లల హేచరీల యాజమాన్యాలు పడుతున్న ఇబ్బందులను తొలగించాలన్నారు. రొయ్య పిల్లల హేచరీలకు ప్రతిబంధకంగా ఉన్న కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ యాక్టు-2005ను సవరించాలన్నారు. రొయ్యల హేచరీల బ్రీడింగ్‌కు అవకాశం కల్పించాలని కోరారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం రొయ్యల రైతులకు ఇస్తున్న విద్యుత్ సబ్సిడీ యూనిట్‌కు రూ.1.50 చొప్పున అందరికీ అందజేయాలని కోరారు. ప్రస్తుతం 10 ఎకరాల్లోపు సాగు చేస్తున్న రైతులకు మాత్రమే ఇస్తున్నారని, ఆ సబ్సిడీని అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సంఘాల నాయకులు ఎస్.అంజిబాబు, అల్లూరు సత్యనారాయణ రాజు, పి.సుబ్బారావు, ఎల్.సుజనా చౌదరి, మోహన్ కుమార్, తోట వెంకట్ పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ

- వెంటనే దొంగను అదుపులోకి తీసుకున్న పోలీసులు

మద్దిపూడి: మండల కేంద్రం మద్దిపూడి నడిగడ్డ, బస్టాండ్ తదితర సమీపంలోని గృహాలను టార్గెట్ చేసుకుని చోరీకి పాల్పడుతున్న దొంగను శుక్రవారం పోలీసులు చాకచక్యంగా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. మండల కేంద్రమైన మద్దిపూడి వడ్డెపాలెంలోని ఉప్పు సుశీల కూలీ పనికి వెళ్లింది. ఇంట్లో ఎవరూలేని సమయంలో పట్టపగలే ఓ దొంగప్రవేశించాడు. సుశీల ఇంటి తాళాలు, ఇంట్లో ఉన్న ఇనుప పెట్టెను పగులగొట్టి అందులో ఉన్న ఒకటిన్నర సవర బంగారం, రూ. 10 వేల నగదును అపహరించాడు. దొంగ ఇంటి వెనుకవైపు ఉన్న తలుపు నుంచి పలాయనం చిత్తగించాడు. తిరిగి వచ్చిన సుశీల ఇంటి తలుపు తాళాలు పగులగొట్టిన విషయాన్ని గుర్తించి పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. ఇంటి వెనుక ఉన్న ఇసుకలో చెప్పుల అడుగులను గుర్తించిన పోలీసులు.. అక్కడే ఉన్న దొంగను అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలు ఉప్పు సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి. అంకమ్మరావు తెలిపారు.



సుశీల ఇంట్లో పగులగొట్టిన పెట్టెను పరిశీలిస్తున్న ఎస్‌ఐ అంకమ్మరావు

వైభవంగా
అపరాధీశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ



ఆలయ నిర్మాణదాత గుంటుపల్లి శివరామకృష్ణ ప్రసాద్‌తో మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తదితరులు

- పాల్గొన్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

త్రిపురాంతకం: శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో పురాతన అపరాధీశ్వరస్వామి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను వేదపండితులు వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొన్నారు. త్రిపురాంతకం స్వామి వారి ఆలయంలో పురాతన అపరాధీశ్వరస్వామి వారి ఆలయాన్ని భక్తుడు గుంటుపల్లి శివరామకృష్ణప్రసాద్ మాధవి దంపతులు ఆర్థిక సహకారంతో పునఃనిర్మాణం చేశారు. అనంతరం పురాతన అపరాధీశ్వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు ఈఓ చెన్నకేశవరెడ్డి తెలిపారు. గతంలో ఉన్న ఆలయాన్ని దక్షిణ గోపుర నిర్మాణంలో భాగంగా ఐదేళ్ల క్రితం పాత ఆలయాన్ని తొలగించారు. అపరాధీశ్వరస్వామి ఆలయ నిర్మాణం తిరిగి పూర్తిచేసి అపరాధీశ్వరస్వామి, నందీశ్వర విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలని వైభవంగా పూర్తి చేశారు. అర్చకుడు విశ్వనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, గ్రామ సర్పంచ్ పొన్న వెంకట లక్ష్మి, ట్రస్టుబోర్డు చైర్మన్ పద్మజ మల్లికార్జున్, సభ్యులు అన్నమ్మ లింగయ్య, సుబ్బారావు, శ్రీను, నాయక్, కొటయ్య, నారాయణమ్మ, వెంకటరెడ్డి, పార్టీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్వీ పిచ్చయ్య యాదవ్, వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఎస్. పోలిరెడ్డి, కో కన్వీనర్ యల్లారెడ్డి, జెడ్పీ ప్రధానోపాధ్యాయుడు టి. రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.



త్రిపురాంతకం నూతనంగా నిర్మించిన అపరాధీశ్వరస్వామి ఆలయం

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- పోలీసు సిబ్బందికి ఎస్పీ మలికాగర్గ్ సూచన

ఒంగోలు టౌన్: ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని పోలీసు సిబ్బందికి ఎస్పీ మలికాగర్గ్ సూచించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీసు సంక్షేమ దివస్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్లతో పాటు వివిధ విభాగాలలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది, హోంగార్డులు ఎస్పీని కలిసి సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎస్పీ.. త్వరితగతిన ఆయా సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. విధి నిర్వాహణలో నిత్యం ఒత్తిళ్లకు గురయ్యే పోలీసు సిబ్బంది సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి వారు ప్రజలకు మరింత మెరుగ్గా సేవలందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రతి శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహిస్తున్న పోలీసు గ్రీవెన్స్‌ను సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ కె.వి.రాఘవేంద్ర, ఆర్ఐ శ్రీహరిరెడ్డి, డీపీవో సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసు సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ మలికాగర్గ్